క్లుప్తంగా

12న అవార్డుల ప్రదానోత్సవం

సీటీఆర్ఐ: పూలే, అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకువెళుతూ రాజకీయాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్న తమ సంఘం ఆధ్వర్యంలో శనివారం పూలే, అంబేడ్కర్ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సానబోయిన రామారావు అన్నారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. జేఎన్ రోడ్డులోని చెరుకూరి గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో శనివారం సాయంత్రం 4 గంటలకు అవార్డుల ప్రదానోత్సవం ప్రారంభమవుతుందన్నారు. ఈ సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాల దళిత సేన అధ్యక్షుడు జేబీ రాజుకు అంబేడ్కర్ అవార్డు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావును పూలే పురస్కారం అందజేస్తామని తెలిపారు.

నేడు వనువులమ్మ జాతర

కడియం: మండల కేంద్రమైన కడియం గ్రామ దేవత వనువలమ్మ జాతర మహోత్సవం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



పద్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న జక్కంపూడి గణేష్ తదితరులు

కడియం: మండలంలోని బుర్రిలంకలో మృతుల కుటుంబాలను వైఎస్సార్ సీపీ నాయకుడు జక్కంపూడి గణేష్ గురువారం పరామర్శించారు. డీసీసీబీ మాజీ డైరెక్టర్ గట్టి సత్యనారాయణ మూర్తి మృతికి ఆయన సంతాపం తెలిపారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అలాగే తూపాటి పద్మ మృతిపై సానుభూతిని వ్యక్తం చేసారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. గణేష్ వెంట స్థానిక నాయకులు కొత్తపల్లి శివాజీ తదితరులు ఉన్నారు.

'గట్టి' సోదరులకు పలువురి పరామర్శ

కడియం: పితృ వియోగంతో బాధపడుతున్న గట్టి సుబ్బారావు, నరసయ్యలను గురువారం పలువురు పరామర్శించారు. వారి తండ్రి సత్యనారాయణమూర్తి మృతికి సంతాపం తెలిపారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. గట్టి సోదరులను పరామర్శించిన వారిలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, కాపు సంఘం నాయకులు ఆకుల రామకృష్ణ, ఐఎస్ఏ మాజీ అధ్యక్షుడు పల్ల సుబ్రహ్మణ్యం, వైస్ ఎంపీపీ పంతం గణపతి, కలిదిండి విశాలాక్షి గోవిందు, దుళ్ల ఉపసర్పంచ్ తోకల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌లు పుల్లారామారావు, ఈదర పాపారావు, ఆత్రేయపురం తహసీల్దార్ రాజేశ్వరరావు, నిడదవోలు సీఐ తిలక్, డా. పరిమి సత్య ప్రసాద్ తదితరులు ఉన్నారు.

జీవ కారుణ్య సంఘానికి రూ.50 వేల వితరణ



చెక్కు అందజేస్తున్న దాతలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరానికి చెందిన స్వర్గీయ అంగటి ప్రకాశరావు (ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల) జ్ఞాపకార్థం ఆయన కుమారులు రమేష్, సురేష్, రాజేష్ గురువారం రూ.50 వేలను గురువారం గౌతమీ జీవకారుణ్య సంఘంలో నిత్యాన్నదాన పథకానికి వితరణ చేశారు. ఈ మేరకు జీవ కారుణ్య సంఘం అధికారి రాజుకు చెక్కు అందించారు. గతంలో వీరి అమ్మ అంగటి పార్వతి జ్ఞాపకార్థం రూ.50 వేలను అందజేశారు.

రామచంద్రునికి పవళింపు సేవ



సీతారాముల పవళింపు సేవ నిర్వహిస్తున్న అర్చకుడు

రాజమహేంద్రవరం సిటీ: శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా సీతంపేట రామాలయంలో గురువారం పవళింపు సేవ నిర్వహించారు. ముందుగా సీతా సమేత శ్రీరామచంద్రునికి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా 21 మంది దంపతులకు సంప్రదాయ రీతిలో తాంబూలాలు అందించారు. అనంతరం సీతారామచంద్రులను పవళింపు చేశారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు స్వామివారి పవళింపు గదిని మల్లెపూలు, 28 రకాల పిండి వంటలతో అలంకరించారు.

ఆటల్లో.. అదరహో..

- క్రీడల్లో సత్తా చాటుతున్న విద్యార్థులు
- జాతీయ పోటీలకు ఎంపిక



జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు వెళుతున్న జూహితను అభినందిస్తున్న హెచ్‌ఎం మల్లేశ్వరరావు, విద్యార్థులు

ప్రకాశం నగర్: సాంస్కృతిక రాజధానిగా పేరుగాంచిన రాజమహేంద్రవరంలో విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ ప్రతిభ కనబర్చడం విశేషం. కేవలం క్రీడలపై ఆసక్తితో తమ ప్రతిభకు పదును పెట్టి, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధిస్తున్నారు. ఇలా అంతర్జాతీయ క్రీడా పోటీలకు ఎంపికై, రాజమహేంద్రవరం ఖ్యాతిని దశదిశలా వ్యాప్తి చేస్తున్నారు. క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్ వంటి సాధారణ క్రీడలతో పాటు వెయిట్ లిఫ్టింగ్, కరాటే, కిక్ బాక్సింగ్, యోగా, చదరంగంలోనూ సత్తా చాటుతున్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో జూహిత ప్రతిభ

లాలాచెరువు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జూహిత జాతీయ స్థాయి 68వ స్కూల్ ఫెడరేషన్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్‌లో సత్తా చాటి బంగారం పతకం సాధించింది. మణిపూర్‌లోని ఇంఫాల్‌లో జరిగిన పోటీల్లో అండర్ – 17 విభాగంలో తలపడింది. గత ఏడాది ఇదే పోటీల్లో కాంస్య పతకం సాధించిన జూహిత, ఈ ఏడాది బంగారు పతకం సాధించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంకం మల్లేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు ఆకాంక్షించారు. ఆ విధంగా బాలిక విజయం సాధించింది. జూహిత గత నవంబర్‌లో తెనాలిలో జరిగిన 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ చాంపియన్ షిప్‌లో బంగారు పతకం సాధించింది. కాగా.. జాతీయ పోటీలకు వెళ్లేముందు జూహితకు పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా వీడ్కోలు కలిపి, పోటీలో రాణించాలని ఆకాంక్షించారు.

ప్రభుత్వ సహకారం అంతంత మాత్రమే

విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ప్రభుత్వం కృషి చేయాలి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో క్రీడలను ప్రోత్సహించేందుకు పలు పోటీలు నిర్వహించారు. క్రీడాకారులకు ఆయా ఆటలకు సంబంధించిన కిట్లు అందజేశారు. అలాగే విజేతలకు నగదు బహుమతులను ప్రదానం చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఆయా పీడీలు కృషి చేస్తున్నప్పటికీ, ప్రభుత్వం సహకారం అంతంత మాత్రంగానే ఉంది.

మంచి భవిష్యత్తు



క్రీడల్లో రాణించిన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుంది. క్రీడా ప్రతిభ ఆధారంగా స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించే అవకాశం ఉంది. చిన్న వయసు నుంచే పిల్లలకు ఆటల్లో శిక్షణ ఇవ్వడం ద్వారా వారు ఆ క్రీడలో బాగా రాణించగలరు. శారీరక ధృడత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుంది. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు ఆటల్లో ప్రోత్సహించాలి.

– ఎస్ఆర్‌కేవీ స్వామి, జిల్లా క్రీడా సమాఖ్య నిర్వహణ కార్యదర్శి

మానవతా విలువలకు వెంకటరెడ్డి ప్రాధాన్యం



వెంకటరెడ్డి విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల, శేషారెడ్డి తదితరులు

కడియం: మానవతా విలువలకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చే అరుదైన పారిశ్రామికవేత్త దివంగత నల్లమిల్లి వెంకటరెడ్డి అని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. జేగురుపాడు పంచాయతీ పరిధిలోని శ్రీరామదాసు పేపర్‌మిల్లు ఆవరణలో శ్రీరామదాసు గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ వ్యవస్థాపకుడు వెంకటరెడ్డి విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ రామదాసు ఇండస్ట్రీస్ ద్వారా వేలాది మందికి వెంకటరెడ్డి ఉపాధి కల్పించారన్నారు. పాఠశాలలు, దేవాలయాల నిర్మాణాలకు విరాళాలు అందించడంతో పాటు, రైతుల వ్యవసాయ భూములు ముంపునకు గురైన సందర్భంలో సొంత నిధులతో కాలువలను బాగుచేయించి అండగా నిలిచేవారన్నారు. ఆయన స్ఫూర్తితో కుటుంబ సభ్యులు శివశంకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, కడియం ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్, మాధవరాయుడుపాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి, వైఎస్సార్‌సీపీ రాష్ట్రకార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), టీడీపీ మండల అధ్యక్షులు వెలుగుబంటి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలను విస్మరించిన కూటమి



విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడిచినా సూపర్ సిక్స్ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని పీసీసీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, జిల్లా కాంగ్రెస్ తాత్కాలిక ఇన్‌చార్జి డాక్టర్ వడయార్ ధ్వజమెత్తారు. నగరంలోని డీసీసీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. తల్లికి వందనం, యువతకు 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు సదుపాయం, ఆడపిల్లకు నెలకు రూ.1500 ఇవ్వడం వంటి హామీలను ఇప్పటి వరకూ నెరవేర్చలేదన్నారు. పేదలకు సంజీవని లాంటి ఆరోగ్యశ్రీ సక్రమంగా అమలు చేయాలని, ఆసుపత్రులకు రూ.3,500 కోట్లు బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పార్టీ నగర అధ్యక్షుడు అబ్దుల్లా షరీఫ్, ప్రధాన కార్యదర్శి పట్నాల శ్రీనివాసరావు, సీనియర్ నాయకుడు బెజవాడ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి తీరుపై భవన నిర్మాణ కార్మికుల నిరసన



డిమాండ్లు నెరవేర్చాలని నిరసన తెలుపుతున్న కార్మికులు

- డిమాండ్లు నెరవేర్చకపోతే మే 5 నుంచి ఉద్యమం
- ఎన్నికల హామీలను నెరవేర్చాలంటూ నినాదాలు

సీటీఆర్ఐ: తమ ఇబ్బందులు, ఆవేదన, సమస్యలపై కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న మొండి వైఖరికి నిరసనగా భవన నిర్మాణ కార్మికులు గురువారం నిరసన తెలిపారు. స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘాల సమాఖ్య అధ్యక్షుడు బొజ్జా రామకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ 2024 మేనిఫెస్టోలో వంద రోజుల్లో కార్మికులకు న్యాయం చేస్తామని చెప్పారన్నారు. వారు అధికారంలోకి వచ్చి పది నెలలు కావొస్తున్నా, ఇంత వరకూ నెరవేర్చలేదన్నారు. తక్షణం స్పందించి భవన నిర్మాణ కార్మికులకు న్యాయం చేయాలని, లేకపోతే మే 5వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు తెలియచేస్తామన్నారు. సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని, సెస్ విధానం ద్వారా వసూలు చేస్తున్న సొమ్మును కార్మికులకే వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి రాజన్నబాబు, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

ఉప్పలూరి సేవలు అభినందనీయం

- జన్మదిన వేడుకల్లో మాజీ మంత్రి వేణు, జక్కంపూడి రాజా
- పలు సేవా కార్యక్రమాల నిర్వహణ



ఉప్పలూరి సత్యనారాయణకు మొక్క అందజేసి శుభాకాంక్షలు చెబుతున్న వేణు, జక్కంపూడి రాజా, గణేష్

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ ఉప్పులూరి వీర వెంకట సత్యనారాయణ సేవలు అభినందనీయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాజానగరం మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా కొనియాడారు. ఉప్పులూరి వీర వెంకట సత్యనారాయణ జన్మదిన వేడుకలను గురువారం వెంకటనగరం, తొర్రేడు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయన అభిమానులు తొర్రేడు, వెంకటనగరం, రాజమహేంద్రవరంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు జరిపారు. ఆలయాల్లో పూజల అనంతరం సర్వమత ప్రార్థనలు చేశారు. వెంకట నగరం సెంటర్‌లో చలివేంద్రం ప్రారంభించారు. తొర్రేడులోని బాలాజీ టౌన్ షిప్‌లో జరిగిన కార్యక్రమంలో సత్యనారాయణ కేక్ కట్ చేశారు. ఆయనకు వేణు, జక్కంపూడి రాజా, జక్కంపూడి గణేష్ పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. ప్రయాణికులకు మజ్జిగ, చెరకు రసం పంపిణీ చేశారు. లాలాచెరువులోని స్వర్ణాంధ్ర ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం, జియోన్ పాఠశాలలో పిల్లలకు అన్నదానంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. వెంకట నగరం శివాలయం వద్ద నిర్మించిన కమ్యూనిటీ హాలును జక్కంపూడి గణేష్‌తో కలిసి ఉప్పులూరి ప్రారంభించారు. తొర్రేడు హరిజనపేటలో వైద్య శిబిరం, చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప్పులూరి భిమానులు, తొర్రేడు, వెంకటనగరం, కాతేరు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా సోమాలమ్మ జాతర



సోమాలమ్మ జాతరలో గరగ నృత్యాలు



ఆకట్టుకున్న శక్తి వేషధారణ

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యిలోని బుచ్చయ్య నగర్‌లో కొలువైన సోమాలమ్మ జాతర గురువారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని గరగ నృత్యాలు, శక్తి వేషధారణలు, కోయనృత్యాలు, వివిధ వేషధారణలతో వీధుల్లో ఊరేగించారు. అనంతరం నూతనంగా నిర్మించిన ఆలయానికి తీసుకువచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ధవళేశ్వరంలో 'పల్లెకు పోదాం'



ధవళేశ్వరంలో పర్యటిస్తున్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు

ధవళేశ్వరం: గావ్ ఛలో అభియాన్ (పల్లెకు పోదాం) కార్యక్రమంలో భాగంగా గురువారం ధవళేశ్వరంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు పర్యటించారు. పార్టీ మండల అధ్యక్షుడు షేక్ సాజిద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తొలుత ధవళేశ్వరంలోని వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న సోము వీర్రాజు అనంతరం పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రం , సచివాలయం, ఆయుష్మాన్ భారత్ వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పన్నాల లక్ష్మీ సంతోషి, రూరల్ అసెంబ్లీ కన్వీనర్ ఆకుల శ్రీధర్, యువమోర్చా రాష్ట్ర కార్యదర్శి కందుకూరి మనోజ్‌బాబు, అసెంబ్లీ కో కన్వీనర్ యానాపు ఏసు పాల్గొన్నారు.

వసతి గృహాల సందర్శన

కంబాలచెరువు: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి గురువారం నగరంలోని పలు సంక్షేమ వసతి గృహాలను సందర్శించారు. ఆవ రోడ్డులోని ఏకలవ్య బాలల వసతి గృహం, బొమ్మూరులోని బాలికల శిశు గృహ వసతి గృహాలకు వెళ్లి, అక్కడ సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం వసతి గృహాల సిబ్బందితో మాట్లాడుతూ విద్యార్థులకు సురక్షిత తాగునీరు, మంచి ఆహారం అందించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వసతి గృహ ప్రాంగణంలో అవసరమైన మరమ్మత్తులను ఎప్పటికప్పుడు చేయించాలన్నారు. వారికి ఎలాంటి వైద్య సహాయం అవసరమైన వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ వసతి గృహంలో ఎటువంటి సమస్యలున్నా, న్యాయ సహాయం కావాలన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు తెలియజేయాలన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

రాజమహేంద్రవరం రూరల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. కవలగొయ్యిలో నూతనంగా నిర్మించిన వెల్‌నెస్ సెంటర్, వాటర్ ట్యాంక్, బుచ్చయ్యనగర్‌లో నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలందరూ విధిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

స్థలం పేరుతో మోసం

రాజమహేంద్రవరం రూరల్: తక్కువ రేటుకు 500 గజాల స్థలం ఇప్పిస్తామని చెప్పి రూ.50 లక్షలకు మోసం చేశారని బొమ్మూరుకు చెందిన ఆకుమర్తి చిన్న గురువారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. 2017లో గుణ్ణం సురేఖ, ఆమె సోదరుడు, మరి కొందరు దివాన్ చెరువు భూమి వివాదాన్ని రెవెన్యూ, పోలీసులతో మాట్లాడి ఆకుమర్తి చిన్న పరిష్కరించారు. ఆ సమయంలో తక్కువ ధరకు 500 గజాలు స్థలం ఇప్పిస్తామన్నారు. ఈ నేపథ్యంలో గుణ్ణం సురేఖ, మరి కొందరికి రూ.50 లక్షలు ఇవ్వడం జరిగింది. కానీ ఇప్పటివరకు స్థలం, ఇచ్చిన సొమ్మును తిరిగి ఇవ్వలేదని ఆకుమర్తి చిన్న తెలిపారు. బొమ్మూరు ఏఎస్సై రాంబాబు నాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జార్జిరెడ్డి వర్ధంతి సభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కిరణ్ కుమార్ తదితరులు

కంబాలచెరువు: ప్రగతిశీల విప్లవ విద్యార్థి ఉద్యమ (పీడీఎస్‌యూ) నిర్మాత జార్జిరెడ్డి వర్ధంతి సభలను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 14న రాష్ట్ర వ్యాప్తంగా సభలు, సదస్సులు, ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. అనంతరం జార్జిరెడ్డి వర్ధంతి సభల పోస్టర్‌ను విడుదల చేశారు. కిరణ్ కుమార్ మాట్లాడుతూ జార్జిరెడ్డి 1947 జనవరి 15న కేరళలోని పాలాట్లో జన్మించారన్నారు. కేరళ, తమిళనాడు, వరంగల్, హైదరాబాద్‌లలో విద్యాభ్యాసం చేశారని తెలిపారు. శాస్త్రీయ విద్యా సాధన కోసం విద్యార్థులందరూ ఐక్యంగా ఉద్యమించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యార్థి, నిరుద్యోగ వ్యతిరేక విధానాలపై పోరాడాలని కిరణ్ కుమార్ అన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.భాను ప్రసాద్, నగర కార్యదర్శి వి.దినేష్ బాబు, నాయకులు రోహిత్, శ్రీను, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

13న బాడీ బిల్డింగ్ పోటీలు

రాజమహేంద్రవరం సిటీ: కాకినాడ సినిమా రోడ్డులోని అన్నదాన సమాజంలో ఈ నెల 13వ తేదీ సాయంత్రం 5 గంటలకు రెండో ఈస్ట్ జోనల్ ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆంధ్రా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ కార్యదర్శి అడ్డూరి వెంకట రమణమూర్తి గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి 200 మంది హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా 8 విభాగాల్లో బాడీ బిల్డింగ్ పోటీలు, రెండు కేటగిరీల్లో మెన్ ఫిజిక్ పోటీలు, ఒక విభాగంలో మాస్టర్స్ పోటీ జరుగుతుందన్నారు. బీఫిట్ జిమ్ అధినేత ఎండీ బాషా ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తామన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి బలవన్మరణం


కంబాలచెరువు: వీరభద్రపురానికి చెందిన తురాయి రాము (32) ఉరి వేసుకుని బలన్మరణానికి పాల్పడిన సంఘటన గురువారం జరిగింది. ఏసీ మెకానిక్‌గా జీవనం సాగించే రాము చెడు అలవాట్లకు బానిసయ్యాడు. నిత్యం మద్యం తాగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో ఇంటిలో అతడి తల్లి, భార్య మందలించింది. ఈ నెల 7వ తేదీన ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చి తలుపులు తెరిచే సరికి రాము కొనఊపిరితో ఫ్యానుకు వేలాడుతూ కనిపించాడు. వెంటనే అతనిని కద్దకు దింపి ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

అత్యాచారం కేసు నమోదు

కంబాలచెరువు: పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేసిన వ్యక్తిపై మూడో పట్టణ పోలీసులు గురువారం అత్యాచారం కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. తాడితోటకు చెందిన ఎస్‌కే నయాబ్ రసూల్‌కు ఒక మహిళతో ఇన్‌స్టాగామ్‌లో పరిచయమైంది. ఆమెకు పెళ్లయి, ముగ్గురు పిల్లలున్నారు. అయితే భర్తతో విడిపోయి వేరుగా ఉంటోంది. రసూల్ అవివాహితుడు. వీరిద్దరూ శారీరకంగా దగ్గరయ్యారు. తనను పెళ్లిచేసుకోవాలని రసూల్‌ను బాధిత మహిళ పలుమార్లు అడిగింది. కానీ అతడు ముఖం చాటేశాడు. దీంతో పోలీసులను ఆశ్రయించింది.

ఎమ్మెల్యే నల్లమిల్లి పిల్లిమొగ్గలు దేనికో?

- చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌పై ఆయన వైఖరి ఏమిటి?
- మరో గ్రాసిమ్ నాటకానికి తెర తీశారా?
- ధ్వజమెత్తిన మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: బిక్కవోలు మండలం బలభద్రపురం సమీపంలోని కాపవరం గ్రామ పంచాయతీ పరిధిలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయ తలపెట్టిన చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్ ఏర్పాటు విషయంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పిల్లిమొగ్గలు ఎందుకు వేస్తున్నారని వైఎస్సార్ సీపీ అనపర్తి నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రశ్నించారు. అనపర్తిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో బీజేపీ తరఫున ఎమ్మెల్యేగా ఉన్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడం లేదా అన్నారు. లేక మరో గ్రాసిమ్ నాటకానికి తెర తీశారా అని సందేహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఎమ్మెల్యే నల్లమిల్లి తన స్వార్థం కోసం అసెంబ్లీలో కేన్సర్ ప్రస్తావన తెచ్చి ఈ ప్రాంత ప్రజల ఆరోగ్యంపై ఎన్నో అపోహలు సృష్టించారన్నారు. మళ్లీ ఈ చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి పరిశ్రమ ఏర్పడితే నిజంగానే ఈ ప్రాంత ప్రజల ఆరోగ్య పరిస్థితి దెబ్బతింటుందన్నారు.

ఆంతర్యమేమిటి

చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి మంత్రి నారాయణ ఈ ప్రాంతంలో పర్యటించడం, మరోపక్క ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ప్లాంట్ ఏర్పాటు జరగనివ్వను అని అనడం ఏమిటో తెలియడం లేదని సూర్యనారాయణరెడ్డి అన్నారు. ప్లాంట్ ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు మొదలుపెట్టి 2 నెలలు కావస్తున్నా ఈ ప్లాంట్‌ను వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ స్పందించిన తర్వాతే ఎమ్మెల్యే నల్లమిల్లి దీనిపై మాట్లాడటంలో ఆంతర్యం ఏమిటని మండిపడ్డారు.

సినిమాలు



శ్యామల	:	గుడ్ బ్యాడ్ అగ్లీ
సూర్యమినీ	:	ఔట్
సూర్యప్యాలెస్	:	జాక్
స్వామి	:	కోర్ట్
శివజ్యోతి	:	గుడ్ బ్యాడ్ అగ్లీ
అనుశ్రీ	:	జాక్
రాజా	:	జాక్
ఊర్వశి	:	ఎల్2ఎంపురాన్
మేనక	:	చెరసాల
రంభ	:	రాబిన్‌హుడ్
కుమారి	:	అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి
అప్సర	:	మ్యాడ్ స్క్వేర్
అశోక	:	జాక్
నామవరం		
వీఎస్ మహల్	:	జాక్
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	జాక్
కడియం		
వెంకటసూర్య	:	జాక్